# మూడు మూళ్ళు పదా ?

'ఒక మూడు మూడు..'

రెండు మూళ్ళారు..'

మూడు మూళ్ళు తొమ్మిదే ఎందుక్కావాలి ? ఎనిమిదెందుక్కాకూడదు ?

ఎనిమిదన్నమాటేమిటి ? పది మాత్రం ఎందుక్కాకూడదు ?

- అనుకున్నాడు శివరావు.

అనుకున్న వెంటనే, మూడో ఎక్కం గుక్క తిప్పుకోకుండా చదువుతున్న కొడుకుని ఆపేసి- "మూడు మూళ్ళు తొమ్మిది కాదు, పది అని చదువు" అని ఆజ్ఞాపించాడు.

కుర్రాడు పాపం చిన్నవాడు. ఆరేళ్ల వాడు. తండ్రి చెప్తున్నదేమిటో వాడికి అర్థం కాలేదు. కాస్సేపు తెల్లబోయి చూసి-

"పుస్తకంలో తొమ్మిదనే వుంది నాన్నా" అన్నాడు.

"వెధవ పుస్తకం... పుస్తకం అవతల పారెయ్. నేను చెప్పినట్టు చదువు... అన్నాడు శివరావు కఠినంగా.

"మా టీచర్ కూడా మూడు మూళ్ళు తొమ్మిదనే చెప్పారు నాన్నా.." అన్నాడు కుర్రాడు మెల్లగా.

శివరావుకి టీచర్ మీద కోపమొచ్చింది.

ఆ పంతులికి పిలక వుంటుంది. ఆ పంతులిప్పుడు తన ఎదటలేకపోయినందుకు

శివరావు చింతించాడు.

ఎదటుంటే "మూడు మూళ్ళు తొమ్మిదని చెప్తావా? అని పిలకపట్టుకు లాగొచ్చు'... అనుకున్నాడు. ఆ తర్వాత కొడుకు మీద కూడా కోపమొచ్చింది శివరావుకి - తనని 'నాన్నా నాన్నా' అంటున్నందుకు.

'నాన్న' కాదు 'నాన్నగారు' అనాలని మొదట కొన్నాళ్ళు పెళ్ళాంచేత చెప్పించాడు కొడుక్కి. అదేమీ లాభం లేకపోయేసరికి తనే స్వయంగా చెప్పడం ప్రారంభించాడు. చాలాసార్లు చెప్పాడు. ఏడాదిగా చెప్తూనే వున్నాడు. అయినా ఎంచేతో గాని పాపం ఆ కుర్రాడికి 'నాన్నా' అనటమే అలవాటైపోయింది.

'మూడు మూళ్ళు తొమ్మిది' అన్నందుకు కొంతా, నాన్నగారూ అనకుండా నాన్నా అన్నందుకు కొంతా కోపమొచ్చి ఆ మొత్తం కోపంతో కొడుకు వీపుమీద ఒక్క చరువు చరిచాడు శివరావు. కుర్రాడు బావురుమన్నాడు.

ఇంతలో లోపల్నించి శివరావు పెళ్ళాం రాజ్యం వచ్చి "ఎందుకట్టా పిల్లాడిని బాదుకుంటారూ, ఇప్పుడు వాడేం చేశాడనీ.." అంది.

శివరావుకి పెళ్ళాం మీద కోపమొచ్చింది.

"ఏం చెయ్యలేదు. ఊరికేనే కొట్టాను. వాడు నా కొడుకు.. నా ఇష్టం. నాక్కోపమొస్తే వాణ్ణే కాదు, వాడితో పాటు నిన్నూ తంతాను... జాగ్రత్త.. ఒళ్ళు దగ్గరపెట్టుకుని మాట్టాడు" అని పెళ్ళాం మీద బిగ్గరగా కేకలేశాడు.

రాజ్యం అతని వంక ఒకసారి ఎగాదిగా చూసి, నిట్టూర్చి, తలవంచుకుని లోపలికెళ్ళి పోయింది.

"మహా చెప్పొచ్చింది సలహాలు. ఇదెవత్తి నాకు చెప్పడానికి ? నాలుగు తగిలిస్తే గాని నా సంగతి తెలిసిరాదు" అని పెళ్ళాం లోపలి కెళ్ళిపోయాక కూడా కాస్సేపు గొణుక్కున్నాడు శివరావు. గొణుక్కుని కొడుకు వంక చూశాడు.

కుర్రాడికి పాపం దెబ్బ బాగా తగిలింది. ఇంకా మెల్లగా ఏడుస్తూనే వున్నాడు.

శివరావుకి ఎక్కాల పుస్తకం అచ్చేసిన వాడి మీద కోపమొచ్చింది.

"వెధవ పుస్తకం, వెధవ లెక్కలు..?" అనుకుంటూ, కొడుకు చేతిలో వున్న పుస్తకం గభాల్న లాక్కుని, సర్రున అది మధ్యకి చించి, ముక్కలు నేలకొసి కొట్టాడు.

పుస్తకం చిరిగిపోయిందనీ, తండ్రి ధోరణికి భయమేసీ కుర్రాడింకా బిగ్గరగా ఏడవటం మొదలెట్టాడు.

"ఏడవకు... ఏడిచావంటే చంపేస్తాను... ఏడవకు' అని కొడుకుని బెదిరించి, చెప్పులేసుకుని

విసురుగా బయటికి నడిచాడు శివరావు.

బజార్లో కెళ్ళి కొంత దూరం నడిచాక, ఎడం కాలు చెప్పుకి ఒక పట్టీ తెగిపోయినట్టు గుర్తొచ్చింది. అందువల్ల తను కాలు ఈడుస్తూ నడుస్తున్నట్టు కూడా గుర్తొచ్చింది.

చెప్పు తెగి మూడు రోజులైంది.

కాలు ఈడవకుండా మామూలుగా నడుద్దామని ప్రయత్నం చేశాడు.

శివరావుకి చెప్పు మీద కోపమొచ్చింది.

చేత్తో తీసి పట్టుకుని పైకెత్తి ఒక్కసారి నేలకేసి కొట్టాడు. అలా కొట్టాక కాస్త కోపం తగ్గింది. చెప్పు మళ్ళీ కాలుకి తొడుక్కుని, మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ ముందుకు నడిచాడు.

నాలుగడుగులు నడిచాక, పేవ్‌మెంట్ మీద చెప్పులు కుట్టేవాడొకడు కనిపించాడు. వాడు చెప్పు పరీక్షించి "పావలా యిప్పించండి బాబూ" అన్నాడు.

"ఇవ్వను" అన్నాడు కఠినంగా.

చెప్పులు కుట్టేవాడికి పొద్దుట్నుంచీ బేరం లేదు అంచేత ఇది కూడా వదులుకోవటం ఇష్టం లేక, కాస్త మెత్తబడి -

"ఎంతోకొంత మీ దయగలిగినంత యిప్పించండి బాబూ... మా రాజులు... మీకు తెలవందేముంది.." అని చెప్పు తీసుకుని కుట్టబోయాడు.

శివరావు గభాల్న వాడి చేతిలోంచి చెప్పు లాక్కుని "అట్లా వీల్లేదు. ఎంత కావాలో ముందే చెప్పు" అన్నాడు.

"ఇరవై పైసలన్నా ఇప్పించండి బాబూ.." అన్నాడు చెప్పులు కుట్టేవాడు దీనంగా.

"ఛస్తే ఇవ్వను. నువ్వెంతడిగితే అంతిస్తానేమిటి ? ఇందాక పావలా అన్నావ్. ఇప్పుడిరవై పైసలు అంటున్నావు. అంతా నీ ఇష్టమేనేమిటి ? ఛస్తే ఇవ్వను. ఇరవై పైసలంటే మాటలనుకున్నావా ? ఇవ్వను గాక ఇవ్వను. పావలాకి మించి పైసా ఇవ్వను. కుడ్తే కుట్టు. లేకపోతే లేదు." అంటూ చెప్పు తొడుక్కుని గబగబా ముందుకి సాగిపోయాడు శివరావు.

చెప్పులు కుట్టేవాడు తెల్లబోయి, నోరు వెళ్లబెట్టాడు.

ఇంకాస్త దూరం నడిచాక ఆకలేస్తున్నట్టు అనుమానం కలిగింది శివరావుకి. పక్కనే పెద్ద కాఫీ హోటలుంది. అందులోకి నడిచాడు. ఒక మూలకెళ్ళి కూర్చున్నాడు. సర్వరొచ్చి, ఏం కావాలని అడిగాడు.

"ఏం కావాలేమిటోయ్ ? ఏం కావాలో తెలీదూ ? కాఫీ హోటల్ కెందుకొస్తారు .? తినడానికొస్తారు. తాగడానికొస్తారు. ఆమాత్రం తెలీదూ ? నేనిప్పుడు తినడానికొచ్చాను

తెలుసా ? అర్జంటుగా వెళ్ళి, తినడానికేమైనా పట్రా..." అన్నాడు శివరావు.

"ఏం తెమ్మంటారో చెప్పండి.." అన్నాడు సర్వర్.

"ఏమున్నాయ్ ...?" అని దర్జాగా అడిగాడు శివరావు.

ఏమున్నాయో గుక్క తిప్పుకోకుండా చెప్పాడు సర్వర్.

శివరావు కాస్సేపు సీరియస్‌గా ఆలోచించాడు.

"త్వరగా చెప్పండి..." అని తొందరపెట్టాడు సర్వర్.

శివరావుకి సర్వర్ మీద కోపమొచ్చింది.

సర్వర్‌ని తందామనుకున్నాడు.

టిఫిన్ తిన్నాక తన్నొచ్చులే అని తనకి తాను సరిపెట్టుకుని "ఏమిటోయ్ తొందర" ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా ? నేను గంటసేపు ఆలోచిస్తాను. త్వరగా చెప్పమనడానికి నువ్వెవడివి ? త్వరగా వెళ్ళి మూడు ఇడ్లీలు, మూడు పూరీలూ, మూడు దోసెలు పట్రా. మూడు మూళ్ళు తొమ్మిది కాదు. పది. జాగ్రత్తగా లెక్కబెట్టి తీసుకురా. లెక్క తప్పొచ్చిందంటే వూరుకోను. త్వరగా వెళ్ళు" అని గదిమాడు.

శివరావుని ఒకసారి పైకి కిందికీ పరిశీలనగా చూసి, మారు మాట్లాడకుండా అవతలకెళ్ళిపోయాడు సర్వర్. వెళ్ళినవాడు ఎంత సేపటికీ రానేలేదు.

శివరావుకి ఈసారి ప్రొప్రయిటర్ మీద కూడా కోపమొచ్చింది. చటుక్కున కుర్చీ లోంచి లేచి, ప్రొప్రయిటర్ దగ్గరకి ఒక్క అంగలో వెళ్ళి, బల్లమీద బలంగా ఒక్క గుద్దు గుద్దాడు.

తలొంచుకుని చిల్లర డబ్బులు లెక్కబెట్టుకుంటున్న ప్రొప్రయిటర్ అదిరిపడ్డాడు. అతని నోట మాట రాకముందే "నీ కసలు హోటల్ నడపడం వచ్చా ? రానివాడివి హోటలెందుకు పెట్టావ్ ? నీకు చాతగాక పోతే నాకప్పగించు.. బ్రహ్మాండంగా మానేజ్ చేస్తాను. నేను బి.ఎ. తెలుసా ? ఏమిటలా చూస్తావ్ వెర్రిమొహమేసుకుని ? నాకు మేనేజర్ ఉద్యోగం ఇస్తావా ? ఇవ్వకపోతే చావు.." అని బల్లమీద మరో గుద్దు గుద్ది, ప్రొప్రయిటర్ తెల్లబోయి చూస్తుండగానే బయటికెళ్ళిపోయాడు శివరావు.

నడుస్తూ నడుస్తూ జేబొకసారి తడిమి చూసుకున్నాడు. చిల్లర డబ్బులు చేతికి తగిలాయ్. ఆ తర్వాత జేబు వంక చూసుకున్నాడు. జేబుపై అంచున ఒక పక్క కొద్దిగా కుట్లూడి, వూడిన భాగం వేళ్ళాడుతోంది.

శివరావుకి జేబు మీద కోపమొచ్చింది

ఊడి వేళ్ళాడుతున్న కొన పట్టుకుని కిందికి ఒక్కలాగు లాగాడు.

జేబంతా చిరిగిపోయి, జేబులో వున్న చిల్లర డబ్బులన్నీ చెల్లాచెదురుగా రోడ్డు మీద పడిపోయాయి. జేబులో చిల్లర డబ్బులే వున్నాయి. ఇంకేమీ లేవు.

కింద గొంతుక్కూర్చుని అవన్నీ గబగబా ఏరుకోవటం మొదలెట్టాడు శివరావు.

అది చూసి, దారేపోయె వాళ్ళెవరో కూడా కొన్ని డబ్బు లేరి శివరావు చేతికివ్వబోయారు.

శివరావుకి వాళ్ళ మీద కోపమొచ్చింది. చటుక్కున లేచి నిలబడ్డాడు. "నా డబ్బులు నా ఇష్టమొచ్చినట్లు పారేసుకుంటాను.ఏరి ఇవ్వడానికి మీరెవ్వరు ? అని బిగ్గరగా అరిచి, చేతిలో అప్పటిదాకా ఏరి వుంచుకున్న డబ్బులు కూడా మళ్ళీ నేలకేసి కొట్టి, గబగబా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

ఒకచోట, కాళ్ళు లేని ముష్టివాడొకడు పేవ్‌మెంట్ మీద కూర్చుని, అడుక్కుంటున్నాడు అక్కడకెళ్ళి ఆగాడు శివరావు.

శివరావుని చూసి "ఒక్క పైసా ధర్మం చెయ్యండి బాబూ..'? అని చెయ్యి ముందుకు చాపాడు ముష్టివాడు.

ముష్టివాడి కెదురుగా చతికిలబడి కూర్చున్నాడు శివరావు. కూర్చుని "ఒక పైసా కాదు. పది పైసలిస్తాను. కావాలంటే వందపైసలు కూడా ఇస్తాను. నాకు ముష్టెత్తడం నేర్పుతావా ? 'అనడిగాడు.

ముష్టివాడు తెల్లబోయి చూశాడు.

"ఏమిటలా చూస్తావ్ ? నేను నిజంగా ఇస్తాను. ఎన్ని పైసలైనా ఇస్తాను నాకు ముష్టెత్తుకోవడం నేర్పు. నా దగ్గర చాలా పైసలున్నాయి. ఎక్కువైపోయి అక్కడ పారేసి వచ్చాను. కావాలంటే తెచ్చి చూపిస్తానుండు" అంటూ గభాల్న లేచి, వెనక్కి తిరిగి, వేగంగా పరుగెత్తడం ప్రారంభించాడు శివరావు.

"నా పైసలు నాకిచ్చెయ్యండి. నా పైసలు నాకిచ్చెయ్యండి" అని అరుస్తూ అలా పరుగెత్తుతూనే వున్నాడు.

రోడ్డు మీద వచ్చేపోయేవాళ్ళంతా వింతగా అతని కేసి చూస్తున్నారు.

అంతకుముందు తను వచ్చి వెళ్ళిన హోటల్ ముందు ఆగి, లోపలికెళ్ళి నా పైసలు నాకిచ్చెయ్యండి.. లేదా ముష్టెత్తుకోవడం అయినా నేర్పండి." అంటూ హోటల్లో కూర్చున్న వాళ్ళొక్కక్కడి దగ్గరకీ వెళ్ళి అడుగుతున్నాడు, శివరావు; అడుగుతూనే మధ్యలో బిగ్గరగా అరుస్తున్నాడు.

నవ్వుతున్నాడు, ఏడుస్తున్నాడు.

"గత సంవత్సరంలో విద్యావంతులైన రెండు లక్షల మంది యువకులకి కొత్తగా

ఉద్యోగాలు లభించాయి. ప్రభుత్వం ఇప్పుడు తల పెట్టిన పథకాల వల్ల మరో రెండు లక్షల మందికి ఉద్యోగాలు లభించవచ్చుననీ , తద్వారా విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య చాలామటుకు తగ్గవచ్చుననీ భావిస్తున్నారు" అని రేడియోలో వార్తల్లో చెబుతున్నారు.

శివరావు బియ్యే పాసయి నాలుగేళ్ళయింది.

క్లాసు కూడా వచ్చింది.

అతను దరఖాస్తు పెట్టని ఉద్యోగం లేదు.

ఉద్యోగం కోసం అతను తిరగని చోటు లేదు.

అతనికి లంచాలు పెట్టదగిన స్తోమతు లేదు.

సిఫార్సులసల్లేవు.

అంచేత శివరావుకుద్యోగం రాలేదు.

నిరుద్యోగులకి ఉద్యోగ సదుపాయాలు కల్పించడానిగ్గాను ప్రభుత్వం ఏటా పథకాలు రూపొందిస్తూనే ఉంది. కోట్లకొద్దీ రూపాయలు ఖర్చు పెడుతూనే వుంది. నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని నాయకులు వాగ్దానాలు చేస్తూనే వున్నారు.

అయినా శివరావుకి ఉద్యోగం రాలేదు.

నాలుగేళ్ళ నుంచీ రాలేదు.

ఉద్యోగం లేకుండా బతగ్గలిగిన ఆర్థిక స్తోమతు కూడా శివరావుకి లేదు.

ఏడాది నుంచీ కుటుంబం గడవటం మరీ కష్టమై పోతోంది.

శివరావుకి పిచ్చెక్కింది.

పిచ్చెక్కిందనే అంతా అన్నారు. ●

*(ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక : 13-6 - 1975)*